కథానిక

# రెండు తరాలు

చింతా శ్రీరామచంద్రమూర్తి

"వాడు నాకు కొడుకుటండీ - ఎందుకొచ్చిన పుట్టుక - వెధవపుట్టుక" అంటూ చుట్ట ముట్టించాడు నారాయణమూర్తి.

"ఇప్పుడీ కొత్త విషయం మీకు తెలియదన్న మాట" అన్నాడు కేశవరావు, ఆరినచుట్ట పారేస్తూ.

"అబ్బే లేదండీ" అన్నాడు నారాయణమూర్తి పొగవదులుతూ.

"అసలు అతనితో మీకు పేచీ ఎందుకొచ్చినట్టు?" అడిగాడు కేశవరావు.

"చెప్పమంటారా?" అన్నాడు నారాయణమూర్తి గొంతు సవరిస్తూ.

గొంతుకు సవరించుకునే నారాయణమూర్తిని గురించి రెండు మాటలు. నారాయణమూర్తిని గురించి ఆ వూళ్లో అందరికీ తెలుసు. పూర్వంలో ప్లీడరు పట్టా తెచ్చుకున్నాడు. అతనికి కోర్టు వ్యవహారాలమాట ఏదైనా, నిత్య జీవితంలో అతని గమనం వేరు. ప్రతీ హాంశంలోనూ క్రొత్త అన్వేషణ చేస్తూనే వుంటాడు. ప్యారిస్‌లో నిముష నిముషానికీ అభిరుచులెల్లా మారతాయని ప్రజలు వూహిస్తూ వుంటారో, అదే విధంగా ఇతనిలోనూ విస్పష్టమైన మార్పుల్ని ప్రజలు కనిపెడుతూనే వుంటారు. అందుకనే నారామూర్తి జీవన మార్గం వేరనడం!

"నా సంతానం అందరిలోకీ పెద్దవాడు వాడే. చిన్నప్పట్నుంచీ వాణ్ని చాలా జాగ్రత్తగా పెంచాను. వాడు బి ఏ. ప్యాసయ్యేవరకూ నా మాటకి జవదాటడం అన్నది లేదు. అది ప్యాసవడమేమిటి, ఛేటీ రావడమేమిటి రెండూ ఒక్కసారే జరిగాయి. ఇంతవరకే నా తెలుసునా కేశవరావుగారూ!" అన్నాడు ప్లీడరు.

"ఆఁ, తెలుసును" అన్నాడు కేశవరావు.

"అసలు అప్పటికి రెండేళ్ళనించి వాడికి పెళ్ళి సంబంధాలొస్తున్నాయి. మీ అబ్బాయి ఏం చదువుతున్నాడని ఒకరూ, వయస్సెంతని ఒకరూ, కట్నం యింత ఇస్తామని ఒకరూ, మా పిల్లని చూసుకుందుకు పంపించమని మరొకరూ యీవిధంగా నా దగ్గరికి చాలా సంబంధాలొచ్చాయి. అయితే నాకప్పట్లో వాడికి వివాహం చెయ్యాలనే వుద్దేశ్యం లేదు. ఏమంటారా, నాదంతా కొత్తపుంత. పెళ్ళి విషయంలో మరీను. మన పూర్వులు అనుసరించిన పంథా ప్రకారం అనుసరించడం నాకు గిట్టదు. పూర్వీకులలో మన వాళ్ళకి పిల్ల నిస్తామనడం చాలు, వెంటనే పిల్లాణ్ని పంపించడమో, లేక వాడి అభిరుచిని తామే నిర్ణయించి, పెళ్ళి ఖాయపర్చి, ఏ మూఢం వెళ్లాకనో పుస్తెముడివేయించడం, యిది మొదటినుండీ వస్తూన్న ఆచారం.

"అయితే యీ ఆచారం ప్రకారం నడవడం నాకిష్టం లేదు. అందుచేత వాడికివచ్చే సంబంధాలన్నింటికీ ఏదో విధంగా సమాధానం చెప్పి వచ్చిన దారే పట్టించేవాణ్ని. ఎవరైనా ఎంతో ఖచ్చితంచేసి అడిగితే మావాడికి బి. ఏ. అయితేనేగాని పెళ్ళిచెయ్యనని ఖరాకండీగా చెప్పేసి సర్దుకునేవాణ్ని.

"ఇలావుంటూండగా మావాడికి కాకినాడలో మూడవ సంవత్సరం పరీక్షలయినాయి. ఇవాళో రేపో వాడు వస్తాడని అనుకుంటూవున్నాము. వాడొస్తాడన్న రోజుకు ఒకరోజు ముందు. ఆవేళ బుధవారం అయింది. నేనూ, లక్ష్మి డాబా ఎక్కి సంతజనాన్ని చూస్తున్నాము. ఇంతలో పోస్టుమేన్ ఉత్తరం పట్టుకువచ్చాడు. ఏమిటో అని విప్పాను. అది వాళ్ళ రూంమేటు రాసింది. ఉత్తరం ఆ మూలనించి యీ మూల వరకూ చదివాను. అందులో చాలా గ్రంథం వుంది.

"నిజానికి అప్పట్లో అది యథార్థమని నేను నమ్మలేదు. ఆఉత్తరం లక్ష్మి మొహంమీద పడే

శాను. ఎవరిదగ్గరనించి అంది. చదువు నీకే తెలుస్తుందన్నాను. చదివింది. చదువు ప్రారంభించే సరికి వివర్ణమైన ఆమె ముఖంనించి కన్నీళ్లు జలజలా రాలడంలో ఉత్తరం పూర్తి అయింది. అదేమిటి వెర్రి మొహానివని నేను మందలించాను. ఇల్లాంటి అభాసులొస్తాయనే మన వాళ్లు యీడొచ్చే సరికి పెళ్లిళ్లు కానిచ్చేవారంది లక్ష్మి. ఎన్ని సంబంధాలొస్తే లెక్ఖేమిటి మీకు, అన్నిటినీ పంపించేస్తారు ఏదో కబురు చెప్పి. ఈడొచ్చిన కుర్రాళ్ళకి పెళ్ళిళ్లు చెయ్యకపోతే ఏంచేస్తారు మరి, అంటూ ఉపన్యాసం చదివింది.

"నేను యిల్లాంటి ఉపన్యాసాలకి లొంగే ఘటాన్ని కాదుగా. ఆ ఉత్తరంలో ఆ అబ్బాయి ఏం రాశాడంటే, రాజిగాడు సానులుండే వీధుల కెడుతున్నాటని. అప్పట్లో మా రాజిగాడు సానులుండే వీధులకెడతాడని నేను నమ్మలేదు. ఏదో గిట్టని కారణం చేత ఆ స్నేహితుడా ఉత్తరాన్ని పోస్టు చేశాడని స్థిరపరుచుకున్నాను.

"మరునాడు రాజిగాడొచ్చాడు. ఆడది అవడంచేత, ఏముక్కైనా కడుపులో దాచుకోలేక లక్ష్మి పైకి అనేస్తుందని దానికి ముందే వార్నింగిచ్చాను. రాజితో ఉత్తరం ప్రసక్తి తేవద్దని. ఏమిరా, యీ ఉత్తరం చూడు, యిది నిజమేనా అని నేను అడగలేదు. కారణం ఏమంటారా, అది యథార్థమని నా విశ్వాసం కాదు కనక. పాపం లక్ష్మి యీ ఉత్తరం ప్రస్తావన చెయ్యక నా వార్నింగుకు విలువ యిచ్చింది.

"అయితే లక్ష్మి రాజిగాడి పెళ్లి విషయంలో వూరుకోలేదు. రాత్రింబగళ్లు నన్ను కోసేసింది. ఏదోఓటి స్థిరపరిచి పెళ్లికానియ్యమని. కాని లక్ష్మికీ నాకూ విషయం మీద ఏకాభిప్రాయం లేక వివాదాలొచ్చాయి. తొందర పడకపోతే రాజిగాడు అందరిలో చెడ్డపేరుతెచ్చుకు భ్రష్టుడైపోతాడని దానివాదం. తొందరపడి కాళ్లు విరగ తొక్కుకోడానికి ఏం ఆడపిల్లా అని నా వాదం.

"ఎన్ని పర్యాయాలో యీ వాదాలు వాదాల్లాగే ఆగిపోయాయి ముగింపు లేక. చివరకు ఓ నాడు సాయంత్రం యీ సమస్యమీద గట్టిగా చర్చించడానికో అన్నట్టు లక్ష్మి నావెంట డాబామీదకు వచ్చింది. సాయంత్రం పడింది. డాబాకి ఆనుకుని వున్న కొబ్బరి ఆకుల్లోంచి ఎర్రెర్రగా సూర్యకిరణాలు పడుతున్నాయి. లక్ష్మి అడిగింది: ఆ సూర్యభగవానుడి ముఖం చూసి చెప్పెయ్యండి, పెళ్ళాడినవాడు ప్రతీ వాడూ బుర్రలేనివాడుకనక, రాజిగాడికికూడా పెళ్ళిచేసి యీ సంసారంలోని ఇబ్బందుల్ని ఇంత త్వరలో కలగచెయ్యడం యిష్టంలేక వాడి పెళ్లి యింత త్వరలో చెయ్యనని తీర్మానించుకున్నారా? వదిలిపోతుంది గొడవ అంది. లక్ష్మి చెప్పిన విషయాలన్నీ నిశ్శబ్దంగా విన్నాను.

"రాజగాడికి అసలు పెళ్లే చెయ్యననే లక్ష్మి వాదన కేవలం సత్యదూరం. రాజిగాడి పెళ్లి విషయమై నా ఆలోచనే వేరు. తనకి పెళ్ళాం కావాలని వాడు గుర్తించుకున్నాడా అని నా అనుమానం. వాడు తన అవసరాన్ని గుర్తించుకుంటే నా అభ్యంతరమేమీ వుండనే వుండదు. మానవుడు వ్యక్తిగతంగా తన అవసరాల్ని గుర్తించుకున్నవాడుగాని స్వేచ్ఛాగామి కాలేడు. నాకు ఆకలి వేస్తోందనుకోండి. ఆకలిని చంపేందుకు అన్నం తినాలని నాకు నేనే గుర్తించుకుంటున్నాను. వెంటనే వెళ్లిభోజనం చేస్తున్నాను. అదేవిధంగా రాజిగాడికి పెళ్ళాం కావాలి: వాడు గుర్తించాడా ఆ విషయాన్ని, అని లక్ష్మిని అడిగాను.

"గుర్తించాడు కనకనే సానులుండే వీధికెళ్లాడు. వాడి ట్రంకునిండా సినిమా బొమ్మలెన్నున్నాయో చూశారా అంది లక్ష్మి. సరే వాడి అవసరాన్ని గుర్తిస్తే నాతో చెప్పమను. నాన్నగారూ, నాకు పెళ్లాం కావాలి, నాకు పెళ్లిచెయ్యండి చెపితే నేను చెయ్యనా అన్నాను.

"ఈమాటలు విని ఏమనుకుందో లక్ష్మి చర్రున మెట్లుదిగి క్రిందికి వెళ్లిపోయింది. వెళ్లిపోయేటప్పుడు చూశాను. దాని ముఖం కందగడ్డలా అయింది. నేనూరుకోలేకపోయాను. దాన్ని సక్రమమార్గంలో పెట్టాలని నేనూ దిగాను డాబా. నారాక చూసి లక్ష్మి అంది: అంతా మీ చాదస్తం గాని, నాకు పెళ్ళాం కావాలని ఏ మగాడైనా చెపుతాడా మీకు? నాకు మొగుడు కావాలని మా అమ్మతోటీ నాన్నతోటీ చెప్పానా నేను? మనిషి ఎదిగే సరికి, వాడి వాంఛల ప్రకారం సంఘాన్ని నడుచుకో

మని కొన్నిసిద్ధాంతాలు ఏర్పరిచారు పెద్దలు. ఆడదానికి పెద్దమనిషి అయ్యేసరికి మొగుడు కావాలంటారు. మగాడికి యిరవై ఏళ్లొచ్చేసరికి పెళ్లి చేసెయ్యాలంటారు; ఇవన్నీ మీకు తెలియనివా అంది ఆమె.

"నిజం. ఇవన్నీ నాకు తెలుసున్నవే. అయితే అవన్నీ పాతపద్ధతులు. సంఘం చైతన్యపూరితం కావాలి. ప్రజ కళ్ళు తెరవాలి. మనంతట మనం యువకులకి త్రోవచూపిస్తే వాళ్ల జవసత్వాలుడిగిపోతాయి. వాళ్ల కోరికల ప్రకారం వాళ్లు వాంఛల్ని సృష్టించుకుని ఆ ప్రకారం నడవాలి. అందుకనే నా సిద్ధాంతాలు మారిపోయాయంటున్నాను. వాణ్ని పెళ్ళాం కావాలని అడగమను, చెయ్యనన్నానా అన్నాను నేను.

"లక్ష్మి ఏమనుకుందో యింక ఆ విషయమై నాతో ప్రస్తావించలేదు. సరేలెండి అంటూ వంటింట్లోకి దారితీసింది. మొండివాడు రాజు కంటే బలవంతుడంటారు. లక్ష్మికి అప్పట్లో నాలో మొండితనమే కనిపించింది కాని, నా వాదంలో వున్న దూరదృష్టి కనిపించ లేదు.

"రాజిగాడికి సెలవులైపోయాయి. నాలుగో సంవత్సరం ప్రారంభంలో. ప్రొద్దున్నే రైలుకి వెళ్ళాలి. రాజిగాడు తిన్నగా నా దగ్గరకు వచ్చాడు. నాకింత సొమ్ము కావాలి యివ్వండి అని తీసుకుని రైలుకి వెళ్లిపోయాడు. మూడు నెలలు గడిచాయి. ఈ మూడు నెలలలోనూ తల్లీ కొడుకుల మధ్య ఏం వుత్తరప్రత్యుత్తరాలు జరిగాయో నాకు తెలీదు. దసరా సెలవులికి వస్తాడనగా నాకో వుత్తరం రాశాడు రాజి. ఎవరో బులుసువారమ్మాయి వుందనీ, ఆ అమ్మాయి తలిదండ్రులు తనని చూసుకుందికి రమ్మంటున్నారనీని నిజానికి అల్లాంటి వుత్తరం నాకప్పట్లో వస్తుందని నేననుకోలేదు పైగా నాకు కించిత్తు కోపం కూడా వచ్చినమాట వాస్తవం. నేను చెప్పిందే వాడి పెత్తనమేమిటని అహంకారం ప్రబలింది. నువ్వు వెళ్లనక్కర్లేదు, వచ్చేయి అని ప్రత్యుత్తరం రాసిపడేశాను. సమాధానం రాసిపడేశాక రాజిగాడి వుత్తరాన్ని లక్ష్మికి చూపించాను. దానిమీద అది అంది, అవసరాన్ని గుర్తించినట్టు యిది ప్రబల నిదర్శనం కాదా అని.

"దసరా సెలవుల్లో రాజి నా ఎదటపడ్డాడు. లక్ష్మి కూడా నాపక్కనే వుంది. ఏమిరా రాజీ నువ్వు నీ అవసరాన్ని గుర్తించావా అన్నాను నేను. గుర్తించానన్నాడు వాడు. గుర్తించాడు కనకనే బులుసువారమ్మాయిని గురించి ఉత్తరం రాశాడని లక్ష్మి నిదర్శన పూర్వకంగా మాట్లాడింది.

"నేను చుట్టముట్టించాను. లక్ష్మి ఓ కుర్చీలోనూ రాజిగాడో కుర్చీలోనూ కూర్చున్నారు. నా మనస్సులో ఏవేవో ఆలోచనలు పర్యటిస్తున్నాయి. నిజానికి యిప్పటివరకూ అన్ని ప్రయత్నాలలోనూ నాకే విజయం సంభవించింది. ఏ మనిషైనా తన అవసరాన్ని గుర్తించుకోకుండా ముందే ఆపని చేసిపెట్టకూడదనే నా వాదం ఫలించింది. రాజిగాడు తనకి పెళ్ళాం కావాలనీ, పెళ్లిచెయ్యమనీ అడుగుతున్నాడు. నేను వాడిష్టం వచ్చిన పిల్లని తీసుకువచ్చి, ఏ మాఘంలోనో పెళ్లిచేసెయ్యాలి. తప్పదు. ఈ పర్యవసానాన్ని అమలులో పెట్టేందుకు నా మనస్సంగీకరించినా హృదయంలో ఏదో కోర్కె అల్లా జరగకూడదని అడ్డుపెడుతోంది. నిముషాలు దొర్లినకొద్దీ నేను చేసుకున్న నిర్ణయం క్రమబద్ధం కాదని ఏదో తపన హెచ్చరిక చేస్తోంది. సరే క్షేమంగా వెళ్లిరా రాజీ అన్నాను నేను. రాజి క్షేమంగా వెళ్ళిపోయాడు. లక్ష్మి పొరిగింటికెళ్ళింది.

"నేను యీజీచైరులో కూచుని కేసు చూసుకుంటున్నాను. కేసు చూసుకుంటున్నా నన్న మాటేగాని నామనస్సు మనస్సులో లేదు. రాజిగాడు అడిగినంతమాత్రాన వాడి అవసరాన్ని మనం తీర్చినట్టయితే వాడు నేర్చుకున్న గుణపాఠం ఏముంది? ఏ గుణపాఠమూ నేర్వని నా నిర్ణయాలకి విలువలేనట్టుగా తోచింది. తీవ్రంగా ఆలోచించాను.

"రాత్రి భోజనాల దగ్గర నేనూ రాజీ కూర్చున్నాము. లక్ష్మి వడ్డిస్తోంది. పాపం లక్ష్మి అనుకుంటోంది. వాడికి పెళ్ళి కూతుర్ని చూసి తీరతాననీ. కాని నాహృదయంలో ఒకటివుంటే మరొకటి ఎల్లా అంటాను? నే ననవలసింది అనేశాను. నీ అవసరాన్ని నువ్వు గుర్తించావు. నీకు పెళ్ళాం కావాలి. తప్పకుండా పెళ్లి చేస్తాను.

అయితే ఒక్కవిషయం అన్నాను. ఏమిటది అన్నాడు రాజిగాడు. కాని ఆ పెళ్లాన్ని పోషించగల సత్తా నీ దగ్గర వుందా అన్నాను. సమాధానం లేదు. అయితే, ఆ పెళ్ళాన్నీ, నిన్నూ నేనొక్క నిముషం యింట్లో వుండనియ్యను. ఆ బాధ్యత అంతా నీదే, నువ్వు భరిస్తాననుకున్న నాడు నా అభ్యంతరం లేదన్నాను.

"నా యీ మాటలకి వాళ్ళిద్దరూ నిర్వెర పోయారు. ఆ మాటల్లో అర్థం ఏముందంటే, వాడికి పెళ్ళాం వచ్చిందంటే మా సంసారాలు రెండూ వెరు పడిపోవాలీ అని. ఈమాటలు విని వాళ్ళిద్దరూ నాకేదో పిచ్చెక్కిందనుకున్నారు. లక్ష్మి అడిగింది. నా అభిప్రాయాన్ని సరిగ్గా వ్యక్తం చెయ్యమని. నేను చెప్పాను. రాజిగాడు ఏమైనా నాలుగు డబ్బులు గణించి స్వయం పోషకంగా వుంటేనేగాని, వాడికీ, వాడి పెళ్ళానికీ సుఖం ఎక్కడిది? అందుకని తనఅవసరాన్ని గుర్తించినవాడు నాలుగు రాళ్లుకూడా సంపాదించుకున్ననాడే పెళ్ళి చేసుకోవాలి. అంత వరకూ పెళ్ళాం వచ్చినా నిష్ప్రయోజనం. నా ధోరణిని సరిగ్గా అర్థం చేసుకుని మరీ వ్యవహరించండన్నాను.

"ఏమనుకున్నారో వాళ్ళిద్దరూ మాట్లాడ లేదు. భోజనాలయ్యాయి. నేను లేచి నాగది లోకి వెళ్ళిపోయాను. వాడు లేచి వాడి గదిలోకి వెళ్లిపోయాడు. నా దృక్పథాలు లక్ష్మికి తెలియనివికావు. నా మనస్తత్వంలో విప్లవం ఆసన్నమైనదని అనుకుని వుంటుంది. ఇంక ప్రతి ఘటనకి దిగలేదు. అంతే కేశవరావుగారూ! ఆరోజు నించీ రాజిగాడికి నేనూ, నాధోరణి నచ్చలేదను కుంటాను. నాతో చెప్పకుండానే కాకినాడ వెళ్లిపోయాడు. బి. ఏ. ఎల్లాగో పూర్తి చేసు కున్నాడు. అవతల వాళ్ళకి వీడికీ ఎల్లాకలిసిందో కలిసింది. పిల్లనిచ్చారు. పెళ్లికానిచ్చారు. సరాసరి బొంబాయి వెళ్లిపోయాడు. అక్కడే ఉద్యోగము సంపాదించుకున్నారు. ఆనాటితో వాడికీ నాకూ మధ్యనున్న సంబంధ బాంధవ్యాలు సన్నగిల్లాయి. వాడి దగ్గరనుంచి ఓ ఉత్తరం ముక్క కూడా యింత వరకూ రాలేదు. అల్లాంటివాణ్ని నా కొడుకని ఎల్లా అనుకోను!" అని ఆగాడు నారాయణమూర్తి.

నారాయణమూర్తి ఆగడమేమిటి, కేశవరావు అందుకోవడమేమిటి రెండూ ఒకసారి జరిగాయి. అయితే యీ రెంటికీ మధ్య కథకుడు కొన్ని మాటలు రాస్తున్నాడు. నారాయణమూర్తి ఈ కథ నంతనీ ఒక్కగుక్కలో కాని చెప్పెయ్యలేదు. రసాన్ని బట్టి తూకాన్ని మారుస్తూ, తూకాన్నిబట్టి అభినయాన్ని సరిపుచ్చుతూ, అభినయానికి వీలుగా లంకాకుచుట్ట పొగవదుల్తూ కథని గెంటుకెళ్లాడు. కేశవరావు కూడా తదనుగుణంగానే తాళమూ వేశాడు.

కేశవరావు మొదలెట్టాడు.

"అయితే మూర్తిగారూ, యింతవరకూ మీరు యథార్థంగా జరిగినదంతా చెప్పారు కదూ. ఈ సమస్య నంతటినీ పరిశీలిస్తే, రాజుదేమీ తప్పు లేదని తోస్తుంది. కారణ మేమిటంటారా, అతని పెళ్లికీ, ఉద్యోగానికీ మిగిలిన అవసరాలకీ అతన్నే బాధ్యుణ్ని చేశారు. అతని బాధ్యతలకి అతనే నాథుడైనపుడు పెద్దరికం సంపాయించడా మరి? ఆ స్వాతంత్ర్యం మీరిచ్చిందేకదా?" అన్నాడు కేశవరావు.

"స్వాతంత్ర్యం అయితే నే నిచ్చాను గాని, నా గౌరవాన్ని తీసెయ్య మనలేదే. ఈ విధంగా తను పెళ్లి చేసుకుంటున్నాననిగాని, భార్యతో సహా బొంబాయిలో కాపురం పెట్టానని గాని నాకొక ఉత్తరం ముక్కైనా రాయనక్కర్లేదా?" అన్నాడు నారాయణమూర్తి.

"రాజు క్రొత్త అన్వేషణలో క్రొత్తతనాన్ని సృష్టించాడు. ఉత్సాహవసంలో క్రొత్తపువ్వులు పూయించాడు. మీకు పుట్టిన కొడుకు కాడేమిటి అందుకనే ముందంజ వేశాడు" అన్నాడు కేశవరావు.

"నిజమే నంటారా" అంటూ గడ్డం పట్టుకు గించి చూస్తూకూర్చున్నాడు నారాయణమూర్తి.

"మీకు తర్వాత జరిగిన కథ పూర్తి వివరాలతో తెలియవన్నమాట" అన్నాడు కేశవరావు.

"తెలియవు" అన్నాడు నారాయణమూర్తి.

"బి. ఏ. పరీక్షలయ్యాయి. ఈ లోగానే పెళ్ళి సంబంధాలకోసం తిరిగేవాళ్లు ఎక్కడ పడితే అక్కడ వలలల్లి కూర్చున్నారు. వెంకట కృష్ణయ్యగారి నెరుగుదురా మీరు. చిన్నతనంలోనే బ్రహ్మసమాజం పుచ్చుకుని, యీ

సంఘాన్ని మరమ్మత్తు చేస్తానని ఎన్నో ఉపన్యాసాలు అవీ యిచ్చేవాడు అతను. చాలా విప్లవ పంథాలో వున్న మనిషి. పదేళ్ళక్రితమే కాకినాడ వదిలి బొంబాయి వెళ్లిపోయాడు. అయితే అతనికో కూతురుంది. ఆకూతురు పినతండ్రి దగ్గరుండి కాకినాడలోనే చదువుకుంటోంది.

"వెంకటకృష్ణయ్యగారికి తొందరేమీ లేదుగాని, ఆయన భార్యకు, మిగిలిన యావన్మంది బంధుకోటికీ, ఎదిగే పిల్లను చూసి రాత్రి కలలు కూడా వచ్చేవి. వయసు వస్తూన్న ఆపిల్లనుచూసి వారిలో అలజడి కలిగింది. వలలు వేశారు. ఆ వలలో రాజుపడ్డాడు. రాజులో వున్న అందం, హుందా, ఆత్మాభిమానమూ వాళ్ళకి నచ్చాయి.

"ఒకనాడు వెంకటకృష్ణయ్యగారి తమ్ముడు రాజు గదికి వచ్చాడు. మా పిల్లని మీకిస్తాను, మీరు చూసుకుందుకి వస్తారా అన్నాడు. అల్లాగే కాని, యిందులో నేను సర్వస్వతంత్రుడ్ని. ఆ వెనక వున్న ఆస్తిపాస్తుల్నిగాని, తల్లిదండ్రుల్నిగాని చూసి మీరు నాకు పిల్లనివ్వ నక్కర్లేదు. వాళ్లకీ నాకూ యీ విషయాలమీద భేదాభిప్రాయాలున్నాయి. నేను స్వతంత్రాభిప్రాయాలున్న వ్యక్తినని మీకుతోస్తే, నన్ను చూచి పిల్లనివ్వండన్నాడు రాజు.

"వెంకట క్రిష్ణయ్యగారి తమ్ముడీ విచిత్రమైన వ్యక్తినిగురించి అన్నగారికి ఉత్తరం రాశాడు. ఏగూటిచిలక ఆగూటిపలుకే పలుకుతుందని సామెత. వెంకటక్రిష్ణయ్యగారొక చిలక. ఆ చిలకలో విప్లవం వుంది. ఆ చిలకలాటిదే యీ చిలకాను. ఇదీ అల్లాంటి పలుకే పలికింది. సెహభాష్ అన్నాడు క్రిష్ణయ్యగారు. వెంటనే బయలుదేరి కాకినాడ చేరుకున్నాడు. రాజుని ఆహ్వానించి తీసుకెళ్లాడు. పిల్ల నచ్చింది. పిల్లాడూ నచ్చాడు. ఎవ్వరితోనూ చెప్ప నక్కర్లేని పెళ్ళి అయిపోయింది.

"అయితే పెళ్ళికి ముందురోజున రాజు చెప్పాడు. తనమీద సంపూర్ణాధికారాలు తనకే వున్నాయనీ, అందుచేత యింతలో పెళ్ళి చేసుకున్నా వుద్యోగం అయితేనేతప్ప, పిల్లని తీసుకెళ్ళననీను. ఈ మాటల్నివిన్న క్రిష్ణయ్యగారు ఒక సూచనచేశాడు. తన కంగీకారమైతే ఏజెన్సీలో వుద్యోగం యిస్తానని. రాజు అంగీకరించాడు.

"అల్లుడూ, మామగారూ, సతీ సహితంగా బొంబాయి వెళ్ళిపోయారు. ఇదంతా క్రిందటి వేసంగుల్లో సంగతి. ఇంతవరకేనా మీకు తెలుసునా మూర్తిగారూ!" అన్నాడు కేశవరావు.

"తెలిసీ తెలియని స్థితి. అయితే రాజిగాడి పెళ్ళి చాలా విచిత్రంగా జరిగిందన్నమాట. నేను చిన్నపట్నించీ చూస్తూనే వున్నాను. వాడిలో ఆత్మాభిమానం ఎక్కువ సుమండీ" అన్నాడు నారాయణమూర్తి. కేశవరావు చుట్టల పెట్టెలోంచి క్రొత్త చుట్టతీసి నోట్లోపెట్టాడు. నారాయణమూర్తి సిగరెట్టువేసి అతని చుట్టకు నిప్పంటించాడు. కేశవరావు ప్రారంభించాడు.

"ఈ పన్నెండు నెలలనించీ, ఏజెన్సీలో పని చేసే పది పదిహేనుమందిలోనూ రాజు చాలా పెద్దపేరు సంపాయించాడు. దానివల్ల అతనికి పరపతి హెచ్చింది. బుర్రలోవున్న తెలివినీ, వివేకాన్నీ సంయుక్తపరిచి కంపెనీని చాలా పెద్దదిగా చేశాడు. తద్వారా క్రిష్ణయ్యగారి అభిమానాన్నీ, అనురాగాన్నీ చూరగొన్నాడు. అల్లా వుంటూండగానే యీ ఆధునాతన సంఘటన జరిగింది. తెలుసునా!" అన్నాడు కేశవరావు.

"ఏమిటదీ?" అన్నాడు నారాయణమూర్తి.

"వాళ్ళ ఆఫీసులో జానకి అనే టైపిస్టు గరల్ వుంది. అందమైందీను, సంస్కారం కలిగిందీను. రాజుకి సాహిత్యంలో ప్రవేశం వుండడం మూలాన్ని జానకితో ఎక్కువ చనువుగా ఉండడం మొదలుపెట్టాడు. ఆమె తీరిక సమయాల్లో, కథలూ అవీ టైపుచేస్తూ, అతని రచనలని మెచ్చుకుంటూ ఎన్నో విధాలుగా జానకి ఉపకరిస్తూ వుండేది. ఒక్కొక్కసారి ఆఫీసు పని అయిపోయాక, వాడింటికి జానకి కూడా వెడుతూండేది.

"రాజు భార్య పద్మావతికూడా సంస్కారం కలిగినమనిషే. ఆకారణంచేత ఈ సమవయస్కులిద్దరూ ఒకరిలో ఒకరు స్నేహాన్ని రుచి చూసుకున్నారు. ఒకరి అభిరుచుల్లో మరి యొకరికి స్థానం వుంది. ఒకరి హృదయంలో మరొకరు తమ ప్రతి బింబాల్ని చిత్రించుకున్నారు. అందు

చేత ఒకరినొకరు అక్కా చెల్లీ అని పిలుచు కునేవారు.

"ఓనాడు సాయంత్రం ఇద్దరూ మెరీనాకి వెళ్ళారు. త్రోవపొడుగునా జానకి రాజులో వున్న విశిష్టమైన మానవ పరిజ్ఞానాన్ని మెచ్చుకుంటూనే వుంది. పద్మావతికి యిందులో ఏ మర్మం వుందో తెలీలేదు. మెరీనా చాలా ప్రశాంత సుందరంగా వుంది. నీళ్ళ మీద చంద్రుడు అనంతకోటి తారకా శకలాలతో ఆడుతూ వెన్నెలని కరిగించి పోస్తున్నాడు. జానకి మైమరచింది. అక్కా అని పిలిచింది. నీ ఆనందంలో నన్నూ భాగస్వామిని చేసుకోవా అంది. పద్మావతి అందికదా, జానకీ! నీ హృదయంలో వున్నదేదో నాతో సువ్యక్తం చెయ్యరాదా అని. లలిత లావణ్యమూర్తిఅయిన రాజుని తన హృదయం కాంక్షించి, భర్తగా అంగీకరిస్తోందనీ, కాని ఆ భాగ్యం తన కెల్లా దక్కుతుందనీ జానకి సమాధానం రాత్రి పడింది. అక్కాచెల్లె ళ్ళిద్దరూ గృహోన్ముఖులయ్యారు.

పద్మావతికి ప్రేమనిగురించి చాలా తెలుసు. ఘనీభవించిన మానవహృదయం ప్రేమ అనే కొలిమిలో ద్రవమై పొర్లి జారుతుండనుకుంది. నిశ్చల దృష్టితో జానకి చెప్పిన విషయాల్ని మెదడుకు పట్టించుకుంది. రాత్రి యింటికి వచ్చిన రాజుతో జానకివిషయం ప్రస్తావనగా తెచ్చింది. అతడు చలించలేదు. నొక్కినొక్కి చెప్పింది. రాజు అడిగాడు. ఆమె ప్రేమ ఎల్లాంటి దనుకుంటున్నావని చాలా గొప్ప దనుకుంటున్నానంది పద్మావతి. ఈ విషయంలో నా అంగీకారం కంటె నీత్యాగం కావాలి. ఏ కష్టమొచ్చినా సుఖమొచ్చినా నీదే బాధ్యత అన్నాడు రాజు. అన్నింటికీ సిద్ధమయ్యే ఆమెను స్వీకరించమని మిమ్మల్ని కోరుతున్నానంది పద్మ. అయితే నా ఒప్పందమే అన్నాడు రాజు.

"ఆ వివాహానికి స్వయంగా విప్లవవేత్త ఐన క్రిష్ణయ్యగారే ఆధ్వర్యం వహించాడు. ఇప్పుడు రాజుకి పెళ్ళా లిద్దరు." అన్నాడు కేశవరావు.

"సరిసరి. ఈ విషయంఅంతా మీ కెల్లా తెలిసింద"న్నాడు నారాయణమూర్తి.

"క్రిందటి నెలలో కంపెనీలో కొన్ని మందులు కొనాలని వెళ్లాను. రాజు అక్కడ వున్నాడు. మాటల సందర్భంలో నా వాలకాన్ని గుర్తుపట్టాడు. మీరు మాయింటికి వస్తూండేవారు. మీ పేరు కేశవరావుగారని అవునా అని అడిగాడు. కాదని ఎల్లా అనగలను? ఒప్పుకున్నాను. వాళ్ళింటికి పిలుచుకెళ్ళాడు. పద్మావతినీ జానకినీ చూశాను. ఇద్దరూ కలిసి ఎంతో మనోహరంగా జీవిస్తున్నారు. వారిద్దరిమధ్యనూ రాజు గోపాలకృష్ణుడిలా వున్నాడు." అన్నాడు కేశవరావు.

"అంతా బాగానేవుంది గాని, యీ విషయాలన్నీ నాకు గాని తల్లికి గాని చెప్పకపోవడం కృతఘ్నత కాదంటారా?" అని అడిగాడు నారాయణమూర్తి.

"కృతఘ్నత ఎల్లా అవుతుంది? శంఖపుష్పంలో క్రొత్తరేకులు వికసించాయి. ఇదంతా కొత్తగా కొత్త అన్నాడు." కేశవరావు.

ఈ మాటలన్నీ అనురాగంతోటీ ఆశ్చర్యంతోటీ వింటూన్న లక్ష్మి ముఖం వికసించింది.

# రంధి

పాటపాడగ మనసు రాదోయీ
మనసుపడినను పాట లేదోయీ

తూర్పుగట్టున వెలిబూది ప్రోగైనదే
పడమటితీరాన బొగ్గు గట్టయినదే

వీణె ముట్టుకొనంగ తంత్రులే తెగినవే
గొంతు సరాళించ ఎంతో బాధాయెనే

నీవాడనని మిత్రుడే నెత్తికెక్కెనే
సుందరీమణి కత్తిచూపుల కోసెనే

తమిదీరు తరుణాల విరులు రాలినవే
వలపులో లెడి భావబధము వీడితినే

దయగల్గు భూములు దగ్ధమౌచుండెనే
ఆ స్వతంత్రపు ఘంట ఆహ్వాన మన్నదే !!

—బెల్లంకొండ చంద్రమౌళిశాస్త్రి